# ప్రజాశక్తి

గురువారం 27 మార్చి 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

### 2 ఎంపిపి స్థానాలకు

# నేడు ఎన్నికలు

- వైస్ ఎంపిపి, కోఆప్టెడ్, వైస్ సర్పంచ్ పదవులకు కూడా..
- అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు
- ఎస్‌పి ఏఆర్ దామోదర్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

జిల్లాలో మార్కాపురం, త్రిపు రాంతకం మండల పరిషత్ అధ్యక్ష స్థానాలకు ఎన్నికలు గురువారం జరగనున్నాయి. వీటితో పాటు పుల్లలచెరువు మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి, యర్రగొండ పాలెం మండల పరిషత్ సభ్యులు(కోఆప్టెడ్ మెంబర్) ఎన్నికలు జరగనున్నాయి. నాలుగు ఉప సర్పంచులు త్రిపు రాంతకం మండలం మిట్టపాలెం, టంగు టూరు మండలం ఆలకూరపాడు, కంభం మండలం తురి మెళ్ల, కొండపి మండలం పెరిదేపి ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు.

**గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు**

జిల్లాలో ఎంపిపి, వైస్ ఎంపీపీ, కో ఆప్టెడ్ మెంబర్, ఉపసర్పంచ్ స్థానాలకు గురువారం జరుగనున్న ఎన్నికల్లో గొడవలు, అల్లర్లు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌పి ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. ప్రశాంతంగా ఎన్నిక నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోసం మార్కాపురం ఎంపిపి ఎన్ని కకు మార్కాపురం సిఐ, త్రిపురాంతకం ఎంపిపి ఎన్నికలకు దర్శి డిఎస్‌పి, పుల్లల చెరువు వైఎస్ ఎంపిపి , కో ఆప్టెడ్ మెంబర్ పదవుల ఎన్నికలకు మార్కాపురం డిఎస్‌పి, ఉపసర్పంచ్‌లకు స్టేషన్ ఎస్‌ఐలను ఇన్‌చార్జిలుగా నియమించామన్నారు. ఎన్నికల సమయంలో 30 పోలీస్ యాక్ట్ అములులో ఉంటుందని, 144 సెక్షన్ అమలు పరుస్తున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది తో పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి హెచ్చరించారు.

## నకిలీ మిర్చి విత్తనాలు సీజ్

5లో

### 'ఉమ్మడి ప్రకాశం'లో

# తండ్రీకొడుకుల పర్యటనలు

- 1న పెన్షన్ల పంపిణీకి పెదగంజాంకు సిఎం చంద్రబాబు రాక
- 2న పీసీపల్లి వద్ద బయో ఇంధన ప్లాంటుకు లోకేష్ శంకుస్థాపన
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం

**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో**

ఏప్రిల్ 1, 2 తేదీల్లో సిఎం చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వరుస పర్యటనలు ఖరారయ్యాయి. ఏర్పాట్లలో ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం నిమగ్నమై ఉన్నారు. సిఎం చంద్రబాబు పర్చూరు నియోజకవర్గం, పెద గంజాం పంచాయతీ పరిధిలోని కొత్తగొల్ల పాలెం గ్రామం రానున్నారు. అక్కడ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో ముఖాముఖి ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఎం చంద్రబాబు పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటికే ఆయన ఆ గ్రామంలో పర్యటించి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

సమస్యలపైనా అధ్యయనం చేసి నూటికి నూరు శాతం పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. సిఎం పర్యటన రోజుకు విద్యుత్ స్తంభాలు, నివాస గృహాలు, సిసి రోడ్లు, రైతులకు విద్యుత్ కనెక్షన్లు, ఇంటింటికీ కుళాయి ఇతర సమస్యలు ఏమి ఉన్నా వెంటనే పరిష్కారం చేయాలని ఆదేశించారు. దీంతో యంత్రాంగం మొత్తం సిఎం పర్యటన సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలపై దృష్టి సారించారు.

ఇక మంత్రి నారా లోకేష్ కనిగిరి నియోజకవర్గం, పీసీపల్లి మండలంలో ఓ భారీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. రిలయన్స్ ఏర్పాటుచేస్తున్న బయో ఇంధన ప్లాంటు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. కనిగిరి నిమ్జ్ పరిధిలోని దివాకర్‌పురం పరిధిలో 435 ఎకరాల్లో ఈ ప్లాంటు ఏర్పాటు చేస్తారు. దీనికి రిలయన్స్ సంస్థ రూ.131 కోట్లు వెచ్చిస్తోంది. ఇక్కడ ఇంధన ప్లాంటు ఏర్పాటు చేస్తున్నారు. ఎంతమందికి ఏఏ తరహా ఉద్యోగాలు లభిస్తాయనేదీ ఆ రోజు ప్రకటించే అవకాశం ఉంది. ఈ ప్లాంటు కోసం ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ప్రత్యేక కృషి చేశారు. మంత్రి గొట్టిపాటి ఈ ప్లాంటును ఇక్కడ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. గతంలోనే దీన్ని ప్రకటించారు. సిఎస్‌పురం మండలంలో సోలార్ భారీప్లాంటును కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇక లోకేష్ పర్యటన కోసం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి భారీ ఏర్పాట్లలో ఉన్నారు. కనిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి, ఉపాధి కల్పన దిశగా అడుగులు వేసేందుకు ఆయన దృష్టి సారించారు. ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు.

# ధాన్యం మొత్తం కొనేదెప్పుడో.?

- బాపట్ల జిల్లాలో కొనుగోళ్లు నిలిపేసిన ప్రభుత్వం
- ఇంకా సుమారు 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు
- ప్రతి గింజా కొంటామన్న హామీని ప్రభుత్వం నెరవేర్చాలని రైతుల డిమాండ్

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం జరుగుతోంది. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు తక్కువగా జరిగాయి. జిల్లాలో ఖరీఫ్‌లో ఐదున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. రైతుసేవా కేంద్రాల ద్వారా 90 వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరిగాయి. జిల్లాలో నేటికీ ఖరీఫ్ ధాన్యం నిల్వలు 90 వేల మెట్రిక్ టన్నుల మేర ఉన్నాయి. జిల్లాలో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను నిలిపివేసింది. ప్రైవేట్ మార్కెట్‌లో ధాన్యానికి ధర లేకపోవడంతో పాటు అసలు కొనేవారు లేకుండా పోయారు. ఈ నేపథ్యంలో రబీ ధాన్యం సేకరణపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడి ఖరీఫ్ దిగుబడుల్లో 80 శాతం పైగా ధాన్యం కొనుగోళ్లు రైతు సేవా కేంద్రాల ద్వారా జరగ్గా, బాపట్ల జిల్లాలో మాత్రం 20 శాతం లోపే కొనుగోళ్లు జరిపారు. ఇతర జిల్లాల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ఇంకా జరుగుతుండగా బాపట్ల జిల్లాలో మాత్రం ఈ నెల 15 నుంచి కొనుగోళ్లు నిలిపివేశారు. జిల్లాలో గతంతో పోల్చి చూస్తే అధికంగానే 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు కొనుగోళ్లు జరిగాయి. కానీ గత వైసిపి ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కన్నా ప్రైవేట్ రంగంలోనే ఎక్కువ ధర ఉన్న నేపథ్యంలో రైతులు ప్రభుత్వం వైపు చూడలేదు. ఈ ఖరీఫ్ సీజన్ నాటికి ప్రైవేట్ రంగంలో ధాన్యం కొనుగోళ్ళు మందగించాయి. ధర కూడా రూ.1600 దాటిన పరిస్థితి లేదు. తేమ కొంచెం ఎక్కువ ఉన్నా.. గింజ తేడా ఉన్నా.. రూ.1300 లోపు ధరపై కొనుగోళ్లు జరగడంతో రైతులు బాగా నష్టపోయారు.

రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామని కూటమి ప్రభుత్వ నేతలు హామీ ఇచ్చారు. కానీ ఆచరణలో అలా జరగలేదు. కల్లాల్లో ధాన్యం ఉందని ప్రభుత్వం మద్దతు ధరతో కొనాలని రైతులు కోరుతూ వచ్చారు. అయితే గత ప్రభుత్వం కంటే ఎక్కువే కొన్నామని మంత్రులు చెబుతున్నారే తప్ప చివరి గింజ వరకు కొంటామన్న హామీని విస్మరించారు. దీంతో ప్రస్తుతం జిల్లాలో రైతుల కల్లాల్లో, కుప్పల రూపంలో దాదాపు 90 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం నిల్వలు ఉండిపోయాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయగా, వ్యాపారులు ఎవరూ కూడా మద్దతు ధరతో ధాన్యం కొనేందుకు ముందుకు రావడం లేదు.

రైతు సేవాకేంద్రాల ద్వారా 75 కిలోల కామన్ రకం ధాన్యంకు రూ.1,725, గ్రేడ్ 'ఏ' రకం ధాన్యంకు రూ.1,740 చొప్పున మద్దతు ధరతో కొన్నారు. కాగా గతేడాది ప్రైవేట్ వ్యాపారులు 75 కిలోల ధాన్యాన్ని రూ.1800కి కొన్నారు. అప్పట్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తక్కువగా ఉండటంతో రైతులు వారికే ధాన్యం అమ్మకాలు జరిపారు. కానీ ఈ ఏడాది మాత్రం ప్రైవేట్ వ్యాపారులు రూ.1400 నుంచి మొదలుపెట్టి రూ.1600 లోపు ధరపైనే ధాన్యం కొన్నారు. ధాన్యంకు తగిన మార్కెట్ లేని కారణంగా ఈ ఏడాది ప్రారంభంలోనే తగిన ధర లేదని చెబుతూ వచ్చారు. ప్రైవేట్ మార్కెట్ కంటే ప్రభుత్వమే ఎక్కువ ధర ఇస్తున్న క్రమంలో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ▶ 2లో

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

## ఒంగోలు నగర సమస్యలు పరిష్కరించాలి

### కలెక్టరేట్ వద్ద సిపిఎం ధర్నా

5లో

మాట్లాడుతున్న కెఎస్.లక్ష్మణరావు

### ఎన్నికలలో గెలిచినా, ఓడినా..

## ప్రజాఉద్యమాల్లో భాగస్వామినవుతా..

### మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

5లో

# ధాన్యం మొత్తం కొనేదెప్పుడో.?

**(మొదటిపేజీ తరువాయి)**

తమ పంటను అమ్ముకోవడం పైనే దృష్టి పెట్టారు. కానీ ప్రభుత్వం ఖరీఫ్ రైతులను ఆదుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో రైతులు రబీ ధాన్యం సేకరణపై ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 2.21 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఐదున్నర లక్షల మెట్రిక్ టన్నుల మేర దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కానీ ధాన్యం సేకరణ ఎంత మేర జరపాలన్న విషయమై అధికారులు సరైన నిర్ణయం తీసుకోకపోవడం రైతుల పాలిట శాపమయింది. ఇతర జిల్లాల్లో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుబడి వస్తుంటే అక్కడ నాలుగున్నర లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోలుకు అనుమతులు పొంది మొత్తం కొన్నారు. కానీ బాపట్ల జిల్లాలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించి, దాన్ని కొంచెం కొంచెంగా పెంచుకుంటూ 90 వేల మెట్రిక్ టన్నుల వరకు కొన్నారు. జిల్లాలో రబీలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందన్న అంచనాలు ఉన్నాయి. ఖరీఫ్‌లో జరిగిన పొరపాటు జరగకుండా రబీలో రైతుల నుంచి మొత్తం ధాన్యం కొనుగోళ్లు జరపడం ద్వారా రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. రైతుల నుంచి రబీ ధాన్యం సేకరణ విషయమై డిమాండ్ ఉన్న నేపథ్యంలో 1.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఇబి విలియమ్స్ తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే రబీ ధాన్యం కొనుగోళ్లు చేపడతామన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి-సంతనూతలపాడు**

ఒంగోలులోని ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే కార్యాలయంలో ఏడుగురికి రూ.5,59,762 విలువచేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ బుధవారం పంపిణీ చేశారు. సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన పి రమణమ్మకు రూ.1,29,163 చెక్కును, బొడ్డువారిపాలెం గ్రామానికి చెందిన పి రామయ్యకు రూ.59,540, పేర్నమిట్టకు చెందిన జి వెంకటేశ్వర్లుకు రూ.34,730, అదే గ్రామానికి చెందిన జి సురేష్‌కు రూ.1,43,502, నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన జి అనిల్‌కుమార్‌కు రూ.66,901, కే తక్కెళ్లపాడుకు చెందిన కే శేషమ్మకు రూ.80,000, అదే గ్రామానికి చెందిన ఎన్ శ్రీదేవికి రూ.45,000 విలువచేసే చెక్కులను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, చీమకుర్తి మండలాల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు, తేళ్ల మనోజ్ కుమార్, మండవ జయంతిబాబు, గొట్టిపాటి రాఘవరావు, సంతనూతలపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరు వెంకటేశ్వరరావు (బాబు), మాజీ ఎంపీపీ వివరం గోవిందు, ఒంగోలు పట్టణ జనసేన పార్టీ కార్యదర్శి కందుకూరు వాసు, 41వ జనసేన పార్టీ అధ్యక్షులు పెర్ణమిట్ట శ్రీనివాస్ పవన్, 42 డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షులు చల్లా కష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఎంసీ సభ్యురాలికి ఆర్థిక చేయూత

## అండగా ఉంటామని ఉపాధ్యాయుల భరోసా

ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

శింగరాయకొండ మండలం బింగినపల్లి గ్రామ ఎస్టి కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ సభ్యురాలు కత్తి మంగమ్మకు మధుమేహ వ్యాధి, నరాల బలహీనతతో కాలి వేలు కూడా తొలగించారు. దీంతో ఆమె మంచానికే పరిమితమైంది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఆమెకు వైద్య సహాయం నిమిత్తం బుధవారం నాడు పాఠశాల ఉపాధ్యాయులు కేశవరపు జాలిరెడ్డి, బీసాబత్తిన శ్రీనివాసరావు పాఠశాల తరపున రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. సభ్యురాలు అయిన మంగమ్మ కుమార్తె తమ పాఠశాలలో 2వ తరగతి చదువుతోందని, ఆర్థిక స్తోమత తక్కువగా ఉండి, చిన్న వయసులోనే ఈ విధంగా అనారోగ్యానికి గురికావడం చాలా బాధగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ వైస్‌చైర్మన్ పొట్లూరి మాలాశ్రీ, సభ్యులు యాకసిరి వాణి, చేవూరి అల్లూరమ్మ, కత్తి పద్మావతి, యాకసిరి భవాని, పాదర్తి విజయలక్ష్మి, పాఠశాల ఆయా చేవూరి జ్యోతి, కుక్‌ఏజెన్సీ పొట్లూరి వెంకమ్మ, చౌటూరి వెంకటలక్ష్మమ్మ, స్థానిక నాయకులు పొట్లూరి రమణయ్య, గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్ చేవూరు శ్రీను, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

---

**మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**O.S. No: 23/2023**

కార్యంపూడి కోటినాగులు ... వాది

Vs

నర్రా చిన్నమ్మాయి మరికొందరు...... ప్రతివాదులు

**D4)** నర్రా వెంకటసుబ్బయ్య తండ్రి రాజారావు R/o ద్వారకపాడు గ్రామం, మార్టూరు మండలం బాపట్ల జిల్లా

పైనంబరు దావాని వాది నర్రా రాజారావు చేసిన బాకీని ఆయన చనిపోయిన దరిమిలా వారసులుగా మీ వద్ద నుండి బాకీ వసూలు నిమిత్తం దాఖలా చేసి మీకు ఎన్ని సార్లు సమన్లు మరియు జప్తు పిటిషను నోటీసులుI.A1082/2023 పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు 02.05.2025 వ తేదిన ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల లోపు హైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనేది. లేనిచో దావా ని మరియు జప్తు పిటిషనను మీ పరోక్షంగా తీర్మానింపబడును.

**// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //**

**మోతుకూరి సుభాష్ బాబు**
**మురకొండ చంద్రశేఖర్**
**అడ్వకేట్స్,అద్దంకి**

---

**మహారాజశ్రీ**
**మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**ఓ.ఎస్. 585/2024**

చెక్కా బాలరంగం ... వాది

వర్సెస్

వెలుగూరి ప్రసాద్ అలియాస్
వెలుగూరి వెంకట సత్య వరప్రసాద్ .... ప్రతివాది

టు,
వెలుగూరి ప్రసాద్ అలియాస్
వెలుగూరి వెంకట సత్య వరప్రసాద్
తండ్రి: కోదండ రామయ్య, నివాసం: బొడిచెర్ల గ్రామం, మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాను వాది ప్రతివాదిపై ప్రామిసరీ నోటు బాకీ రాబట్టు నిమిత్తం పై కోర్టులో దావా వెయ్యగా కోర్టు వారు దావా సమన్లు జారీ చేయగా, దావా సమన్లు ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసినారు. కావున తేదీ: 22-04-2025న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను.లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించ బడును.

**// కోర్టు వారి ఉత్తర్వులతో //**

**వాయిదా: 22-04-2025** **ఇ.శారద**
**మార్కాపురం** **అడ్వకేట్, మార్కాపురం.**

---

**మహారాజశ్రీ**
**మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**ఐ.ఎ. 1370/2024**

**ఇన్**

**ఓ.ఎస్. 585/2024**

చెక్కా బాలరంగం .... పిటీషనర్/వాది

వర్సెస్

వెలుగూరి ప్రసాద్ అలియాస్
వెలుగూరి వెంకట సత్య వరప్రసాద్
............. రెస్పాండెంట్/ప్రతివాది

**రెస్పాండెంట్:**
వెలుగూరి ప్రసాద్ అలియాస్
వెలుగూరి వెంకట సత్య వరప్రసాద్
తండ్రి: కోదండ రామయ్య, నివాసం: బొడిచెర్ల గ్రామం, మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఐ.ఎ. 1370/2024 ఇన్ ఓ.ఎస్. 585/2024 పిటీషను షెడ్యూలు ఆస్థి జప్తు నిమిత్తం పై కోర్టులో దావా వేయగా, ఐ.ఎ. నోటీసులు జారీ చేయగా, నోటీసులు ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసినారు. కావున తేదీ: 22-04-2025న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

**// కోర్టు వారి ఉత్తర్వులతో //**

**వాయిదా: 22-04-2025** **ఇ.శారద**
**మార్కాపురం** **అడ్వకేట్, మార్కాపురం.**

---

**మహారాజశ్రీ ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**EP No : 42/2024**

**OS No : 24/2019**

ఆలపాటి హరిబాబు .... వాది /డిక్రీ హోల్డరు

వర్సెస్

పోలినేని వెంకటస్వామి (డైడ్) వగైరా
... ప్రతివాది/జె.డి.ఆర్.

**To**
**JDR2)**
చుండూరి సూర్యకుమారి, భర్త సుబ్బయ్య,
శ్రీ నగర్ కాలనీ, అద్దంకి టౌన్, బాపట్ల జిల్లా.

మాక్లయింట్ మీపై, పై దావాలో డిక్రీ ప్రకారం రావలసిన పరిహారములను రాబట్టు కొనుటకు మీకు గల స్థిరాస్తిని జప్తు చేయించి తదుపరి వేలం ద్వారా డిక్రీ పరిహారం వడ్డీ ఖర్చులతో సహా రాబట్టు కొనుటకు అమలు దరఖాస్తును దాఖలు చేసి యున్నారు. సదరు పిటిషన్ యందు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచుండుటచేత శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు జారీ చేయించు లాగు ఉత్తర్వులు దయచేయించుచూ ది:11-04-2025వ తేదికి వాయిదా దయచేయించినారు. కావున మీరు తేది :11-04-2025న ఉదయం 10:30కు స్వయంగా గాని లేదా వకిలు ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు తెలుపుకొన వలసియున్నది లేనియెడల మీపరోక్షమునందు తీర్మానించబడునుని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

**// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //**

**ఒంగోలు**
**తేది : 26-03-2025** **ఇట్లు**

**కంకర యోగిరెడ్డి**
**న్యాయవాది**
**గోల్డెన్ టవర్స్, ఒంగోలు**
**సెల్ : 9705456168**

---

**మహారాజశ్రీ**
**మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**ఇ.పి. 48/2019**

**ఇన్**

**ఓ.ఎస్.24/2018**

1) యక్కలి బాల తిమ్మిశెట్టి
(చనిపోయినందున వారసులు)
2) యక్కలి సుబ్బరత్నమ్మ
(చనిపోయినందున వారసులు)
3) యక్కలి వెంకట రామసుబ్బారావు మరియు ఇతరులు ... డి.హెచ్.ఆర్స్

వర్సెస్

తిరువీధి పెద్ద వెంకటేశ్వర్లు
(చనిపోయినందున వారసులు)
1) తిరువీధి సుధారాణి మరియు ఇతరులు
...జె.డి.ఆర్స్

**టు,**
**జెడిఆర్ నెం:1**
తిరువీధి సుధారాణి, భర్త: లేట్ పెద్ద వెంకటేశ్వర్లు
**జె.డి.ఆర్-2**
తిరువీధి సాగర్, తండ్రి: లేట్ పెద్ద వెంకటేశ్వర్లు
**జె.డి.ఆర్-3**
తిరువీధి సత్యనారాయణ, లేట్ పెద్ద వెంకటేశ్వర్లు
అందరి నివాసం: ఇంటి నెం: 10-464-హెచ్-1, విజయటాకీస్ రోడ్డు, మార్కాపురం టౌన్ అండ్ మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఇ.పి.48/2019లో జె.డి.ఆర్స్ 1 నుండి 3 వరకు ఆర్డర్ 21 రూల్ 66 సి.పి.సి. నోటీసులు జారీ చేసిననూ మీకు ముట్టని కారణంగా, కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున తేదీ: 01-05-2025న ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

**// కోర్టు వారి ఉత్తర్వులతో //**

**వాయిదా: 01-05-2025** **ఇ.శారద,**
**మార్కాపురం** **అడ్వకేట్, మార్కాపురం.**

---

**మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి వారి కోర్టులో**

**I.A.No: 308/2023**

**I.A.No: 1411/2012**

**O.S.No: 58/2009**

Between :

దర్శి వెంకట కృష్ణయ్య (డైడ్) వగైరా... పిటిషనర్స్

మరియు

దర్శి హనుమంతరావు వగైరా...... రెస్పాండెంట్స్

***To***

**1వ రెస్పాండెంటు)** దర్శి హనుమంతరావు
తండ్రి శ్రీ రామకృష్ణశర్మ R/o దర్శి
అగ్రహారం మార్టూరు మండలం అద్దంకి డిఎంసి
**2వ రెస్పాండెంటు)** దర్శి మారుతి సుబ్రమణ్యం
తండ్రి శ్రీ రామకృష్ణ శర్మ VRO R/o అద్దంకి టౌన్
అద్దంకి డిఎంసి
**3వ రెస్పాండెంట్)** సాగంరెడ్డి వీరారెడ్డి
తండ్రి రామస్వామిరెడ్డి R/o జొన్నతాళి గ్రామం
మార్టూరు మండలం అద్దంకి డిఎంసి
**4వ రెస్పాండెంటు)** సాగంరెడ్డి సుబ్బారెడ్డి
తండ్రి రామస్వామిరెడ్డి R/o జొన్నతాళి గ్రామం
మార్టూరు మండలం అద్దంకి డిఎంసి
**5వ రెస్పాండెంటు)** దుగ్గసాని సాంబిరెడ్డి
తండ్రి కోటిరెడ్డి R/o జొన్నతాళి గ్రామం,
మార్టూరు మండలం, అద్దంకి డిఎంసి
**6వ రెస్పాండెంటు)** కాకర్ల తిరుపతమ్మ
భర్త లేటు వెంకటేశ్వర్లు R/o జొన్నతాళి గ్రామం
మార్టూరు మండలం, అద్దంకి డిఎంసి

పైనంబర్ పిటిషనులో చనిపోయిన 4వ పిటిషనరు అయిన దర్శి మల్లికార్జునరావు చనిపోయినందున ఆయన వారసులుగా పైనంబరు పిటిషనులోని 6 to 8 పిటిషనర్లను వారసులుగా చేర్పించమని కోరుచూ పైపిటీషను దాఖలు చేసినందున ఇందు నిమిత్తం మీకు ఎన్నిసార్లు నోటీసులో పంపిననూ అవి జారీ కాబడి ఉండలేదు. కాబట్టి శ్రీయుత కోర్టు వారి అనుమతితో మీకు పైనంబరు విషయమును తాలూకు నోటీసులను ఈపేపరు ప్రకటన ద్వారా జారీ చేయడమైనది. ఇందును గూర్చి మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేది 02-04-2025వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకునేది. లేనియెడల పై విషయము ను మీ పరోక్షమున తీర్మానించబడునని ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.

**// శ్రీయుత కోర్టు వారి అనుమతితో //**

**అద్దంకి** **ఇట్లు**
**తేది:26-03-2025** **పంచాగ్నుల రమేష్**
**పిటిషనర్స్ తరపు అడ్వకేట్,అద్దంకి**
**సెల్ : 99487 88290**

---

**మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**O.S.No : 354/2024**

మెఘావత్ మంత్రీనాయక్ ..వాది

యెదరి

మెఘావత్ సోమ్లా నాయక్ మరియు ఇతరులు
..ప్రతివాదులు

***To***

**D3 to D6 చిరునామా**

బిలావత్ మంత్రీబాయి భర్త స్వామినాయక్,**(D3)**
గుంతకందాల తాండ, వెలుగోడు మండలం,
నంద్యాల జిల్లా.
మెఘావత్ సాలిబాయి భర్త లేట్ బాలనాయక్**(D4)**
దిగువమెట్ట తాండ, గిద్దలూరు మండలం,
ప్రకాశం జిల్లా,
మెఘావత్ రమేష్ నాయిక్
తండ్రి లేట్ బాల నాయక్,**(D5)**
దిగువమెట్ట తాండ, గిద్దలూరు మండలం,
ప్రకాశం జిల్లా,
మెఘావత్ మహేంద్ర నాయిక్
తండ్రి లేట్ బాల నాయక్,**(D6)**
దిగువమెట్ట తాండ, గిద్దలూరు మండలం,
ప్రకాశం జిల్లా,

పై నెంబర్ దావాలో మీపై దావా పరిహారం కొరకు దావా దాఖలు చేసి యున్నందున, మీకు సమను నిమిత్తము 28-03-2025 తేదికి వాయిదా వేసియున్నారు. కనుక తేదీ28-03-2025 ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ, మీ వకీలు గారి ద్వారా గాని పైకోర్టులో సంజాయిషీ చెప్పుకోవలసియున్నది. లేని యెడల మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

**// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //**

**వాయిదా తేదీ : 28-03-2025**

**ఇట్లు**
**కాకునూరి హిమశేఖరరెడ్డి,**
**వాది పరం న్యాయవాది,**
**గిద్దలూరు, ప్రకాశం జిల్లా.**

---

**ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది**

ప్రకాశం జిల్లా, చీమకుర్తి సబ్.డి.యిలాకా, చీమకుర్తి మండలం, చంద్రపాడు గ్రామ కాపురస్తుడనైన వల్లంరెడ్డి సత్యనారాయణ రెడ్డి గారి కుమారుడు వల్లంరెడ్డి హరిక్రిష్ణారెడ్డి, వయస్సు 41 సం.లు, తెలియ చేయడ ఏమనగా

నాకు తాత గారైన వల్లంరెడ్డి మీరారెడ్డి తండ్రి యల్లమందారెడ్డి గారున్నూ, మరియు నా చిన్న తాత గారైన వల్లంరెడ్డి రమణారెడ్డి తండ్రి యల్లమందారెడ్డి అనువారలకు ఒంగోలు రిజిస్ట్రారు ఆఫీసులో 1వ పుస్తకం, దస్తావేజు నెం.1137/1982 రుగా రిజిష్టరు కాబడిన ఆస్థికీ చెందిన డాక్యుమెంటు నెం.1137/1982 ను ఒరిజినల్ తీసుకొని తేది 24.03.2025న నా సొంత పనుల మీద చంద్రపాడు గ్రామము నుండి ఒంగోలు డిపోకు వచ్చి, డిపోలో టిఫిన్ చేయుచుండగా నాఒరిజనల్ డాక్యుమెంటు (1137/1982) వున్న బ్యాగ్ కనిపించకుండా పోయినది. నేను ఎంత వెతికినా నాకు కనిపించలేదు. సదరు డాక్యుమెంటు దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కి గాని లేదా చిరునామాకు గాని తెలియపరచ వలసిందిగా కోరుచున్నాను

**ఇట్లు**
**వల్లంరెడ్డి సత్యనారాయణ రెడ్డి**
**తండ్రి వల్లంరెడ్డి హరిక్రిష్ణారెడ్డి,**
**చంద్రపాడు చీమకుర్తి మండలం, ప్రకాశం జిల్లా**
**సెల్ : 9848056840**

# కార్యదర్శులపై అదనపు పని భారం..

- సర్వేలతో సతమతం
- సచివాలయాల్లో ప్రజలకు అందని సేవలు

ప్రజాశక్తి -రేపల్లె

పని ఒత్తిడితో గ్రామ కార్యదర్శులు ఇక్కట్లకు గురవుతున్నారు. పేరుకే వారు పంచాయతీ కార్యదర్శులు. పని విషయంలో ప్రతి ఉద్యోగికి ఓ పరిధి అంటూ ఉంటుంది. పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న వారి పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఈ పని చేస్తే సరిపోతుంది అని కాకుండా.. అన్ని పనులు వారే చేయాల్సి వస్తోంది. ఈ పని, ఆ పని కాకుండా పంచాయతీ పరిధిలోని అన్ని రకాల పనులను పర్యవేక్షించాల్సిన బాధ్యత వీరిపైనే ఉంది. సర్వేల ఒత్తిడి వల్ల కార్యదర్శులు ప్రజలకు సేవలు అందించలేక పోతున్నారు. గ్రామ పంచాయతీలకు సచివాలయాలకు వచ్చే ప్రజలు రోజులు తరబడి కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. రేపల్లె మండలంలో 28 గ్రామపంచాయతీలు 23 సచివాలయాలు ఉన్నాయి. అతి తక్కువ మంది సిబ్బందితో గ్రామ పంచాయతీలు సచివాలయాల వ్యవస్థ నడుస్తుంది. వాటర్ ట్యాప్ కనెక్షన్ సర్వే, హౌస్ హోల్డ్ సర్వే, ప్రతి ఇంటి జియో ట్యాగింగ్ సర్వే.. ఎంఎస్ఎంఇ సర్వే, చిల్డ్రన్ వితౌట్ ఆధార్ సర్వే, పి 4సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే.. ఇలా మొత్తం 39 సర్వేలు నిర్వహిస్తున్నారు. ఒకదాని తర్వాత ఒకటి వరుసగా వస్తుండటంతో సచివాలయం ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. అన్ని సర్వేలకు నియమిత కాల వ్యవధి నిర్ణయించడం ఉద్యోగులను ఒత్తిడికి చేస్తోంది. అన్ని శాఖల సర్వేలు ఒకేసారి కావడంతో తీవ్ర గందరగోళానికి గురికావాల్సి వస్తుందని కార్యదర్శులు వాపోతున్నారు. సర్వేలు ఎందుకు ఉపయోగపడతాయో ప్రజలకు వివరించలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఆయా సర్వేలు, పథకాల అమలు బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై మోపడంతో రోజు రోజుకు పని భారం పెరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమపై పని భారం తగ్గించాలని కార్యదర్శులు కోరుతున్నారు.

మండల పరిషత్ కార్యాలయం

## వృద్ధురాలి మెడలోని బంగారం గొలుసు చోరీ

ప్రజాశక్తి-మార్కాపురం

సినీ ఫక్కీలో వృద్ధురాలి మెడలో బంగారం గొలుసును గుర్తు తెలియని యువకులు తస్కరించారు. ఈ ఘటన మార్కాపురం పట్టణంలోని శ్రీసాయి బాలాజీ సినిమా థియేటర్ ప్రాంతంలోని జంక్షన్ రోడ్డు వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వాడకట్టు రమాదేవి అనే వృద్ధురాలు ఇంట్లోని చెత్తను చెత్తకుప్పలో పడేసేందుకు ఉదయం 5:30 గంటల ప్రాంతంలో బయటకు వచ్చింది. అదే సమయంలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు బైక్‌పై అక్కడకు చేరుకున్నారు. ఆమెపై పెప్పర్ స్ప్రే చేశారు. అనంతరం మెడలోని రెండున్నర తులం బంగారు గొలుసును తీసుకొని అక్కడి నుంచి పారిపోయారు.చోరీ గురైన బంగారు గొలుసు విలువ రూ. 2.40 లక్షలు ఉంటుందని అంచనా. బాధితురాలు మార్కాపురం పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబుకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సిసి పుటేజీలు పరిశీలిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- పెద్దారవీడు

ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. ఆమె భర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని గొబ్బూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మానపాటి లక్ష్మి(51) అనే మహిళ మృతి చెందింది. ఆటో నడుపుతున్న ఆమె భర్త వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. వీరిది నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం స్వగ్రామం. ఏడేళ్లుగా యర్రగొండపాలెంలో నివాసం ఉంటున్నారు. కుమారుడు సంపత్‌కుమార్ ఫిర్యాదు మేరకు పెద్దారవీడు ఎస్ఐ పి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

## పేద కుటుంబానికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-చీరాల

లెట్స్ హెల్ప్ ఆర్గనైజేషన్ సంస్థ ఓ పేద కుటుంబానికి చేయూతగా నిలిచింది. చీరాల మండలం బుర్లవారిపాలెం గ్రామానికి చెందిన గండు కోటేశ్వరమ్మకు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారింది. లెట్స్ హెల్ప్ ఆర్గనైజేషన్ ముందుకొచ్చి కోటేశ్వరమ్మకు ఉపాధి కల్పించేందుకు గేదెలు కొనుగోలు రూ. 30 వేలు నగదును లెట్స్ హెల్ప్ సంస్థ ప్రతినిధి కనపర్తి కిరణ్ కుమార్ చేతుల బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లగా ఎన్నారై రామిశెట్టి దిలీప్ కుమార్, అనూషా దంపతుల సహకారంతో లెట్స్ హెల్ప్ సంస్థ ద్వారా విద్యార్థులకు, వికలాంగులకు, పేదలకు మహిళలకు, వద్దులకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దయాకర్, డేవిడ్,రాజేష్, సాంబయ్య, ప్రకాష్, డేనియల్, రాజు పాల్గొన్నారు.

## ప్రతి చివరి ఎకరాకు సాగు నీరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వేమూరు

వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి నియోజకవర్గంలోని ప్రతి చివరి ఎకరాకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. వేమూరు నియోజకవర్గం అమర్తలూరు మండలం, కూచిపూడి లాకుల సమీపంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఇరిగేషన్ మరియు డ్రైనేజీ అధికారులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, రైతులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోవు ఖరీఫ్ సీజన్‌లో చివరి ఎకరా వరకూ నీరు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అందుకు సంబంధించి కాలువల మర్మతులు ఉంటే తక్షణమే అంచనాలు రూపొందించి నివేదికలు అంద జేయాలన్నారు. వేసవి సీజన్ అయిపోయే సరికి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. రైతుల నుంచి వచ్చిన విన్నతులను స్వీకరించి అధికారులతో మాట్లాడి ఆ పనులు కూడా పూర్తయ్యే విధంగా చూడాలని ఆయన ఆయా శాఖల అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ మరియు డ్రైనేజీ అధికారులు, వేమూరు నియోజకవర్గ పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, రైతులు పాల్గొన్నారు.

రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

## నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రేపల్లె

రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గరికపాటి వెంకటగిరిధర్, ఉపాధ్యక్షులుగా వాక వెంకట శివరాం ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పాల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా పి.జాన్ హానక్, కోశాధికారిగా ఆళ్ల సూరిబాబు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా చందోలు కోటేశ్వరరావు లైబ్రేరియన్ విభాగానికి ఎండి జహంగీర్ బేగ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి న్యాయవాది జి. ప్రశాంత్ కుమార్ తెలిపారు.కార్యవర్గ సభ్యులుగా వై.ధర్మ తేజ, జి.కుమార్ బాబు, జి.రామారావు ఆయన తెలిపారు.

## దేశాభివృద్ధికి పాటుపడాలి

ప్రజాశక్తి - వేటపాలెం

విద్యార్థులు దేశ అభివృద్ధికి పాటుపడాలని సెయింట్ ఆన్స్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు,కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు కోరారు. సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పాలిటెక్నిక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన అధ్యాపకులు కె. జగదీష్ బాబు మాట్లాడుతూ సమాజంలోని ఉన్నత స్థాయి వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు అంకిత భావంతో కషిచేసి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. పాలిటెక్నిక్ డిప్యూటీ డైరక్టర్ విజయభాస్కర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులను, విద్యను నేర్పిన గురువులను గౌరవించాలన్నారు.ఆధునిక టెక్నాలజీలను నేర్చుకొని ఉన్నత ఉద్యోగాలలో స్థిర పడాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాలిటెక్నిక్ రెండవ సంవత్సరం విద్యార్థులు ఆఖరి సంవత్సరం విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధి పతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందిపాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యుల కృషి అభినందనీయమని ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ కిషోర్ కుమార్ తెలిపారు. మార్టూరు సమీపంలోని గొట్టిపాటి హనుమంతరావు కాలనీకి చెందినషేక్ సుభాని గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు ఇటీవల పనిచేస్తున్న సమయంలో గ్రానైట్ రాయి కాలు మీద పడి కాలు విరిగింది. కాలుకు ఆపరేషన్ చేయించుకొని ఎలాంటి జీవనోపాధి లేక మంచానికే పరిమితం అయ్యాడు. విషయాన్ని స్థానికులు హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌వలి దష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన ఖాదర్‌వలి డాక్టర్ కిషోర్ కుమార్, సభ్యులతో కలిసి సుభానిని పరామర్శించారు. రూ.5 వేలు నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. సుభాని పరిస్థితి చూసి చలించి పోయిన సిటీ కేబుల్ నిర్వాహకులు షేక్ బాషా, షేక్ కలేషా, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు నిర్మల, సభ్యులు కలిసి మరి కొంత ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎస్ఐ కె.హరిబాబు, సకల ఆంజనేయులు, పుట్ల అయ్యప్ప స్వామి, అమ్మ ఆశ్రమం నిర్వాహకులు గుంటుపల్లి చందు, రహీమా, అబ్దుల్ మాలిక్, కోటేశ్వరరావు, కాసిం బుడే పాల్గొన్నారు.

## పాఠశాలను విలీనం చేయొద్దు

ప్రజాశక్తి- కారంచేడు

మండల పరిధిలోని దగ్గుబాడు అంబేద్కర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను విలీనం చేయొద్దని గ్రామ సర్పంచి గేరా రవీంద్రనాథ్ ఠాగూర్ విద్యాశాఖ అధికారులను కోరారు. అంబేద్కర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 32 మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలిపారు. ఇక్కడి పిల్లలను అదే గ్రామంలో మరొక ప్రాంతంలోన్ను మండల పరిషత్ ప్రాథమిక మెయిన్ పాఠశాలలో విలీనం చేయడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అదే జరిగితే దళిత విద్యార్థులు చదువుకు దూరం అవుతారని తెలిపారు. అంబేద్కర్ నగర్ పాఠశాలలోని మూడు ,నాలుగు, ఐదు తరగతి విద్యార్థులను మెయిన్ పాఠశాలకు తరలించడం వలన కేవలం 12 మంది మాత్రమే మిగులుతారని తెలిపారు. దీంతో ఏక ఉపాధ్యాయ పాఠశాలగా మిగులుతుందని, దీంతో పాఠశాల మూసివేతకు గుర్తై స్థానిక విద్యార్థులకు చదువుకు దూరం అవుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు పునరాలోచించి అంబేద్కర్ నగర్ పాఠశాలను మెయిన్ పాఠశాలలో విలీనం చేసే ప్రక్రియ విరమించుకోవాలని ఆయన కోరారు.

## సారా నిర్మూలనపై ప్రచారం

ప్రజాశక్తి- బాపట్ల

సారా తయారీని సమూలంగా నిర్మూలించి సారా విక్రయాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో ప్రచార రథాన్ని ప్రారంభించినట్లు ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారి కె. విజయ తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బాపట్ల ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని స్టువర్టుపురం , బేతపూడి గ్రామాల్లో సారా నిర్మూలనపై ప్రచారం నిర్వహించేందుకు ప్రచార రథాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ సారా తయారీ జోలికి వెళ్లి తరచూ పోలీసులు పట్టుబడి ఇబ్బందులు పడవద్దని తెలిపారు. గౌరవమైన వత్తులు చేసుకుంటూ జీవనం సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎక్సైజ్ సూపరింటెంట్ జి.దేవదత్తు, అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెంట్ బి.వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సిఐ పి. గీతిక , ఎస్ఐలు డి.ప్రభుదాస్, ఎస్.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పర్చూరు

వేసవిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ జి.సౌమ్య తెలిపారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు చేశారు. వడదెబ్బ తగిలినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రానున్న రోజుల్లో కూడా ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. వేసవికాలంలో వద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని అన్నారు. ఎండ తగలకుండా గొడుగుని, టోపీని ఉపయోగించాలన్నారు.

# కృపానందంకు ఘన నివాళి

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు, సిపిఎం సీనియర్ నాయకులు అమర్తలూరి కృపానందం అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. కృపానందం స్వగ్రామైన ఆవులవారిపాలెం క్రీస్తు లంకలో ఆయన మృతదేహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి. సిపిఎం నాయకులు పి.నరసింహ రావు బుధవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన కపానందం చిన్న వయసులోనే కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై సిపిఎంలో సభ్యుడి చేరినట్లు తెలిపారు. భూస్వాములు దళితుల్ని విడగొట్టి గొడవలు పెడుతున్న సమయంలో దళితులను ఐక్యం చేసి పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి కపానందం అని తెలిపారు. మండల వ్యవస్థ ఏర్పడిన తరువాత 1987 నుంచి 92 మధ్య కాలంలో కొల్లూరు మండల ఎంపిపిగా పనిచేసినట్లు తెలిపారు. ఆయన ఆశయాలను మనందరం ముందుకు తీసుకెళ్లినప్పుడే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు. సిపిఎం నాయకులు పి. నరసింహారావు మాట్లాడుతూ కపానందం మండల అధ్యక్షుడు ఉన్నప్పుడు కోగంటి రంగారావు, కృపానందంపై హత్యాయత్నం జరిగినట్లు తెలిపారు. సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ చివరి నిమిషం వరకూ ప్రజల కోసం, పార్టీ కోసం పనిచేసిన వ్యక్తి కపానందం అని తెలిపారు.కొల్లూరులో ప్రజా సంఘాల కార్యాలయం నిర్మాణానికి కృపానందం పడిన శ్రమ వర్ణాతీతమైనదని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్, రైతు సంఘం నాయకులు ములకా శివ సాంబిరెడ్డి, రేపల్లె డివిజన్ కార్యదర్శి మణిలాల్, భట్టిప్రోలు మండల కార్యదర్శి జి.సుధాకర్, వేమూరు మండల కార్యదర్శి బి.అగస్టీన్, కొల్లూరు మండల కార్యదర్శి వేములపల్లి వెంకటరామయ్య, దుగ్గిరాల మండల కార్యదర్శి జె.బాలరాజు, నాయకులు టి.సురేష్, బి.సుబ్బారావు, సత్యనారాయణ, మరియారావు, మనోజ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**ఎమ్మెల్యే ఆనందబాబు నివాళి**

కొల్లూరు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు, కామ్రేడ్ అమర్తలూరు కపానందం మృతదేహాన్ని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సందర్శించి పూలమాలలు వేసి నివాళి లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో టిడిపి కొల్లూరు మండల అధ్యక్షుడు మైనేని మురళీకష్ణ, నాయకులు పెదపూడి నాగరాజు, ఎడ్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు

తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

## జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని వినతి

ప్రజాశక్తి బాపట్ల

ప్రజా సమస్యలను ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ సమాజంలో బాధ్యతగా పత్రికా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయటం హేయమైన చర్య అని బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు అన్నారు. మీడియా రంగంపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ సభ్యులు తహశీల్దార్ సలీమాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓ దినపత్రికలో గుంటూరు జిల్లా బ్యూరో చీఫ్‌గా పనిచేస్తున్న గంగాధర్‌ను బెదిరించటం, భౌతిక దాడులకు ప్రయత్నించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటీవల జర్నలిస్టులపై జరుగుతున్న ఘటనలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉన్నాయన్నారు. వార్తలు రాసిన విలేకరిపై దాడి చేయడం దారుణమన్నారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెస్ క్లబ్ సెక్రటరీ బత్తుల యజ్ఞ సురేష్, కోశాధికారి బుర్రా అంజనేయులు, జర్నలిస్టులు చాన్ బాషా, బండ్రెడ్డి గోపి, చీమల దిన్నె నారాయణ, మద్దిబోయిన గోపి, సుభాని, జోగి సువర్ణరాజు, విన్నకోట శ్రీనివాసరావు, యాసం రాజా రమేష్, చప్పిడి వెంకట్రావు, జంగం దాసు, కత్తి రాజు, షాహిహన్, పులిపాటి రాజు, వీరేష్, షాలేం రాజు పాల్గొన్నారు.

## 28న జాబ్‌మేళా

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయం, బాపట్ల ఇంజినీరింగ్( ఆటోనమస్ ) కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పి. ప్రణయ్ తెలిపారు. ఈ జాబ్ మేళాకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్,ఐసిఐసి బ్యాంక్ హెటిరో లాబ్స్ ,యూత్ ఫర్ జాబ్స్,హేయంబర్ కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్హతను బట్టి రూ.12 వేల నుంచి రూ. 25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, డిప్లొమా, బిటెక్ ,ఎంఎ, బిఎ, ఎంసిఎ చదివిన 8 నుంచి 28 సంవత్సరాల లోపు వారు జాబ్ మేళాకు హాజరు కావచ్చునని తెలిపారు. ఆసక్తి కలిగిన బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ల జిరాక్స్,ఆధార్ నకలు పాస్ పోర్ట్ సైజ్ ఫోటో తో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చునని తెలిపారు.

వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

## సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల మండలం కుక్కలవారిపాలెం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక సచివాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొండయ్య మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేదని తెలిపారు. గ్రామానికి దక్షిణం వైపు ఉన్న రైస్ మిల్లుల నుంచి వచ్చే ధూళి దుమ్ము నివారించాలని కోరారు. అర్హత ఉన్నవారికి సామాజిక పెన్షన్లు ఇవ్వాలన్నారు. ఎన్నికలకు ముందు ప్రారంభించి అసంపూర్ణంగా వదిలివేసిన రహదారులను నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు శకుంతల, రామకష్ణారెడ్డి, ఆసోది అక్కమ్మ, విజయలక్ష్మి ,రుక్మిణి , తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# నేడు మండల కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక

ప్రజాశక్తి- భట్టిప్రోలు

భట్టిప్రోలు మండల పరిషత్ కో ఆప్షన్ పదవి గత కొంతకాలంగా ఖాళీగా ఉంది. దాన్ని భర్తీ చేసేందుకు ఎన్నికల అధికారి నుంచి ఆదేశాలు అందాయి. దీంతో గురువారం కో ఆప్షన్ సభ్యుడి ఎన్నికకు అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటివరకూ కో ఆప్షన్ సభ్యుడిగా పనిచేసిన షేక్ ఫిరోజ్ మహమ్మద్ ఆ పదవికి రాజీనామా చేశారు. మండలంలో మొత్తం 14 మంది ఎంపిటిసిలు ఉన్నారు. అందులో వైసిపి మద్దతుదారులు 12 మంది ఉన్నారు. టిడిపి మద్దతుదారుడు ఒకరు, బిజెపి మద్దతు దారుడు ఒకరు ఉన్నారు. అయినప్పటికీ ప్రస్తుతం కో ఆప్షన్ సభ్యుడి పదవిని కైవసం చేసుకునేందుకు జత విధాలా ప్రయత్నిస్తోంది. 14 మంది ఎంపిటిసిలకు గానూ 8 మంది మెజార్టీ ఉన్న వ్యక్తి కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నిక అవుతాడు. కూటమి ప్రభుత్వం తమ అభ్యర్థులచేత నామినేషన్లు వేయించేందుకు సిద్ధం అవున్నట్లు తెలుస్తుంది. అదే విధంగా వైసిపి కూడా తమ అభ్యర్థుల చేత నామినేషన్ వేయించేందుకు సిద్ధంగా ఉంది. వైసిపి ఎంపిటీసీలలో మహిళలు 8 మంది ఉన్నారు. వీరంతా వైసిపి అభ్యర్థికి ఓటు వేసేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలుస్తోంది. మిలిగిన నలుగురు పురుష ఎంపిటిసిల్లో ఒకరిద్దరూ కూటమి వైపు జారిపోయినప్పటికీ మెజారిటీ సభ్యులు వైసిపి వైపు ఉండే అవకాశం ఉంది.

మండల పరిషత్ కార్యాలయం

**ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి : ఎంపిడిఓ**

మండల కో ఆప్షన్ సభ్యుడి ఎన్నికకు అని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంపిడిఓ ఎస్. వెంకటరమణ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల లోపు నామినేషన్ దాఖలు, 10 గంటల నుంచి 12 గంటల లోపు నామినేషన్ల స్క్రూటీ ఉంటుందన్నారు. 12 గంటలకు బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారని తెలిపారు. ఒంటిగంటలోపు నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం ఎంపీటీసీలు చేతులెత్తే పద్ధతి ద్వారా కోఆప్షన్ సభ్యుడి ఎన్నుకుంటారిని తెలిపారు. అదేవిధంగా పెదపులివారు గ్రామపంచాయతీ ఉపసర్పంచి ఎన్నిక కూడా బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ తెలిపారు.

## పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి -చెరుకుపల్లి

రైతులు పండించిన ఉత్పత్తులను సక్రమంగా మార్కెటింగ్ చేయడం ద్వారా గిట్టుబాటు ధరలు పొందవచ్చునని బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ కెఎస్ఆర్.పాల్ తెలిపారు. స్థానిక పొన్నపల్లి వ్యవసాయమార్కెట్ యార్డులో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అనుసంధానాలపై ఐకార్ మరియు ఎస్సి సబ్ ప్లాన్ క్రింద బాపట్ల మండల రైతులకు అవగాహన సదస్సు మరియు అపరాల కొనుగోలు కేంద్ర సందర్శన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ శాఖ అధికారి బాలాజీ గంగాధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాపట్ల వ్యవసాయ కళాశాల అగ్రికల్చర్ ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కెఎస్ఆర్.పాల్, అగ్రికల్చర్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ హైమాజ్యోతి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణ శ్రీ మాట్లాడుతూ రైతులు పండించిన అపరాలు మరియు వివిధ వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెటింగ్ విధివిధానాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి మరియు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది , బాపట్ల మరియు చెరుకుపల్లి మండల రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-వేటపాలెం

విద్యార్థులు ప్రణాళికా ప్రకారం చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని చీరాల సబ్ జూనియర్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. సుధ తెలిపారు. చీరాల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కాంప్లెక్స్‌లోని గిరిజన పాఠశాలలో పోక్స్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మన చుట్టూ ఉన్న మానవ మగాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థినులు విద్య మీదనే తమ దృష్టిని కేంద్రీకరించి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. బాలికలకు ఉన్న చట్టాల గురించి అగాహన పెంచుకోవాలన్నారు. న్యాయం శాస్త్రంలోని చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గ్రేస్, వేటపాలెం ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు, ఎస్‌డి.మతీన్, ఎస్ఎం.సుభాని, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న పెందుర్తి వెంకటేష్, జేసీ, ఏఎస్పీ

## సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాశక్తి-చినగంజాం**

ముఖ్యమంత్రి చంద్రబాబు ఏప్రిల్ ఒకటో తేదీ పెద్దగంజాంలోని కొత్తగొల్లపాలెం పర్యటనకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను సీఎం టూర్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావుతో కలిసి బుధవారం పరిశీలించారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ ఒకటిన ముఖ్యమంత్రి చంద్రబాబు చినగంజాం మండలం, పెద్దగంజాం పంచాయతీ పరిధిలోని కొత్తగొల్లపాలెంలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హెలిప్యాడ్ స్థలాన్ని అధికారులతో కలిసి చూశారు. పెన్షన్ల పంపిణీ లబ్ధిదారుల వివరాలు సేకరించారు. గ్రామమంతా కలిగి గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల ముఖాముఖి సభ స్థలాన్ని గ్రామంలోని రచ్చ బండ వద్ద నిర్వహించాలన్నారు. కార్యకర్తల ముఖాముఖి సభా వేదిక, అధి కారులతో సమీక్ష సమావేశం ప్రాంగణాన్ని గ్రామానికి తూర్పు వైపు ఉన్న కుడి వైపు వేదిక ఎడమవైపు హెలిపాడ్ లను ఏర్పాటు చేయాలన్నారు గ్రామంలోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసు కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్ నాయుడు, డీఎస్పీ మహమ్మద్ మోయిన్, తహశీల్దార్ జీవిగుంట ప్రభాకర్‌రావు, ఎంపీడీవో కే.శ్రీనివాసరావు సర్పంచి కృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు వీరయ్య పాల్గొన్నారు.

# అనుమానితుల వేలిముద్రల సేకరణ

**గస్తీ విధుల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న పోలీస్ శాఖ**

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

జిల్లా పోలీసులు గస్తీ విధుల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ఎమ్.ఎస్.సి.డి పరికరం ద్వారా అనుమానితుల వేలి ముద్రల సేకరణ చేస్తూ సమర్ధవంతంగా రాత్రి పూట గస్తీ విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, ఏటీఎంలు, బ్యాంకులు ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో విస్తతంగా గస్తీ నిర్వహిస్తున్నారు. గస్తీ నిర్వహించే సిబ్బంది విధులలో అధునాతన సాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నారు. ఎవరైనా అనుమానితులు తారసపడితే వారిని విచారించి వారి వేలిముద్రలను మొబైల్ సెక్యూరిటీ చెక్డ్ డివైస్ (ఎమ్.ఎస్.సి.డి) పరికరం ద్వారా సేకరిస్తున్నారు. దీనిలో గతంలో నేరం చేసిన వారి వివరాలు నిక్షిప్తం చెయ్యబడి ఉంటాయి. అనుమానితుడు వేలి ముద్రలను స్కాన్ చేసి వారిపై ఎక్కడైనా కేసు నమోదు అయిఉన్నట్లయితే ఆ వివరాలను తెలుసుకొని స్టేషన్ ఎస్.హెచ్.ఓ.లకు సమాచారం అందించి తదుపరి చర్యలు తీసుకుంటున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్‌డూడి మాట్లాడుతూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం గడిపేందుకు, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలలో జిల్లా పోలీసులు రాత్రిపూట గస్తీ విధులు పటిష్టంగా నిర్వహిస్తున్నారన్నారు. ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తూ రాత్రి వేళల్లో లాడ్జిలు, రైల్వే స్టేషన్ లు, బస్టాండ్‌లలో కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీసి అనుమానిత వ్యక్తులను ప్రశ్నిస్తున్నారన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని మొబైల్ సెక్యూరిటీ చెక్డ్ డివైస్ (ఎమ్.ఎస్.సి.డి) పరికరం ద్వారా అనుమానితుల వేలిముద్రలను సేకరించి వారి గత నేర చరిత్ర తెలుసుకోవడం జరుగుతుందన్నారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో రాత్రి సమయాలలో అనుమానాస్పదంగా తిరుగుతున్న 7,953 మంది వ్యక్తుల వేలిముద్రలను ఈ పరికరం ద్వారా స్కాన్ చేయడం జరిగిందన్నారు. వారిలో 17 మంది గతంలో వివిధ రకాల కేసులలో ముద్దాయిలుగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. అత్యవసర సమయంలో మినహా వివిధ కారణాలతో అర్ధరాత్రుళ్లు బయటకు వచ్చేవారు తప్పనిసరిగా వారి వ్యక్తిగత గుర్తింపు కార్డు ఏదైనా వెంట తెచ్చుకోవాలన్నారు. గుర్తింపు కార్డు లేని వారిని అనుమానితులుగా పరిగణించి విచారించవలసి ఉంటుందన్నారు. గస్తీ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ప్రశ్నించినప్పుడు వారికి సహకరించాలన్నారు. నేరాలను నియంత్రించడానికి పోలీస్ శాఖ తీసుకునే చర్యలకు ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

## నకిలీ మిర్చి విత్తనాలు సీజ్

**ప్రజాశక్తి-సంతమాగులూరు**

మండలంలోని మామిళ్ళపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగ్గుల కొండ పొలాలలో నకిలీ మిరప విత్తనాలను విజిలెన్స్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు, ఆదర్శనగర్‌కు చెందిన సంపతి శ్రీనివాసరావు ఎటువంటి అనుమతులు, లైసెన్సులు లేకుండా మిరప విత్తనాలను రైతులు వద్ద తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారు. పొలాలలో గ్రేడింగ్ మిషన్‌లో ప్యాకింగ్ మిషన్ ఉపయోగించి.. మిర్చి విత్తనాలను ప్రాసెసింగ్ చేస్తూ వ్యాపారులకు అమ్ముతున్నారు. పొలాలలో ఈ గ్రేడింగ్ రాత్రిపూట వరకు కూలీలను మాట్లాడుకుని వారికి అధిక కూలి ఇచ్చి గ్రేడింగ్ చేస్తున్నారని అధికారులు తెలిపారు. రీజినల్ విజిలెన్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖ అధికారులు గుంటూరు విజిలెన్స్ సిఐ కె.చంద్రశేఖర్, పల్నాడు విజిలెన్స్ సిఐ పి శివాజీ, గుంటూరు విజిలెన్స్ ఏవో ఆదినారాయణ దాడి చేసి.. 7,875 కేజీల మిరప విత్తనాలను సీజ్ చేశారు. వాటి విలువ రూ.4,98,750 ఉంటుందని మండల వ్యవసాయ శాఖాధికారి లావణ్య తెలిపారు.

మాట్లాడుతున్న పీడీ శ్రీహరి

## పథకాల అమలులో వికలాంగులకు పెద్దపీట

**మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శ్రీహరి**

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

మెప్మా పథకాల అమలులో వికలాంగులకు పెద్ద పీట వేస్తున్నట్లు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ప్రాజెక్ట్ డైరెక్టర్ పొట్లూరి శ్రీహరి తెలిపారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణ వికలాంగుల సమాఖ్య పునరుద్ధరణ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మెప్మా పీడీ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్వయం ఉపాధి పథకాలు చేనేత రథం, తప్తి క్యాంటీన్, మొబైల్ క్యాంటీన్లు, ఇతర పథకాల నిర్వహణలో వికలాంగులకు ప్రథమ స్థానం కల్పిస్తామన్నారు. ఇప్పటివరకు బ్యాంకుల ద్వారా 33 వికలాంగుల సంఘాలకు రూ.2.2 కోట్ల రుణాలు వారి స్వయంఉపాధికి మంజూరు చేశామన్నారు. జొన్న బాలాజీ, మక్కెన సులోచన, వల్లంరెడ్డి యశోదలను ఘనంగా సత్కరించారు. సమావేశంలో కొత్త పధాదికారుల అధ్యక్షులు పసుమర్తి రాజేష్, కార్యదర్శి యల్లాల శివకష్ణారెడ్డి, కోశాధికారి షేక్ అస్మా, పట్టణ వికలాంగుల సంఘ నాయకులు అమీర్, పట్టణ వికలాంగుల సమాఖ్యలోని సంఘాలు, ఒంగోలు కమ్యూనిటీ ఆర్గనైజర్లు, డిపిఎంయు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆప్టికల్ ఫైబర్ కేబుల్ లైన్లు పెంపుపై ప్రశ్న

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

దేశం, ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లాలో గత 5 సంవత్సరాలలో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ లైన్ల పెంపుదలపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర సమాచార, గ్రామీణాభివద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానమిస్తూ 2019-20 నుండి 2023-24 వరకు 'భారత్ నెట్ ప్రాజెక్టు'లో దేశం మొత్తంలో 3,65,085 కిలోమీటర్ల ఆప్టికల్ ఫైబర్ కేబుల్ లైన్లు నిర్మించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 55,245 కిలోమీటర్లు, ప్రకాశం జిల్లాలో 5,481 కిలోమీటర్లు నిర్మించామని పేర్కొన్నారు. దేశం మొత్తంలో కేబుల్ లైన్ల నిర్మాణానికి రూ.22,325 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,379 కోట్లు ఖర్చు చేశామన్నారు. 2025 ఫిబ్రవరి 28 నాటికి దేశం మొత్తంలో భారత నెట్ ప్రాజెక్టును 2,09,291 గ్రామ పంచాయతీల్లో ఆప్టికల్ ఫైబర్ సేవలు అందించుటకు సిద్ధం చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 13,035, ప్రకాశం జిల్లాలో 1,034 గ్రామ పంచాయతీలు సిద్ధం చేసినట్లు కేంద్ర మంత్రి తెలియజేశారు.

# ఒంగోలు నగర సమస్యలు పరిష్కరించాలి

- ప్రజాసమస్యల పరిష్కారానికి తగినన్ని నిధులు కేటాయించాలి
- పేదలందరికీ 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి
- సత్వరం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలి
- నగరంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి పరచాలి
- సిపిఎం చేపట్టిన ధర్నాలో పలువురు వక్తలు

డిఆర్‌ఒ ఓబులేసుకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

దశాబ్దాలుగా ఒంగోలు నగరంలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని, అందుకు తగినన్ని నిధులు కేటాయించాలని సిపిఎం డిమాండ్ చేసింది. నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, పేదలందరికీ రెండేసి సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని, టిడ్కో ఇళ్లను పూర్తిగావించి లబ్ధిదారులకు అందించాలని, నగరంలో మౌలిక వసతులు మెరుగుపరచాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ నెల 7 నుంచి 17 వరకు పది రోజులు పాటు సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి నగరంలోని పలు డివిజన్ల నుంచి తరలివచ్చిన ప్రజలు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాడు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె మాబు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. వాటి పరిష్కారానికి పాలకవర్గాలు చేపట్టిన చర్యలు నామమాత్రమేనన్నారు. ఈ నెల 7 నుంచి 17 వరకు తమ పార్టీ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించామన్నారు. తమ పార్టీ అనేక ఉద్యమాల నేపథ్యంలో ఏర్పడిన 70 శివారు కాలనీలలో పక్కా గహాలు, తాగునీరు, విద్యుత్తు, రోడ్లు, వంటి మౌలిక సమస్యలు అనేకం ఉన్నాయని ఏకరవు పెట్టారు. దశాబ్దాలుగా నగరంలో నివసిస్తున్న పేదలకు గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు సెంటు చొప్పున 20,840 మంది లబ్ధిదారులకు పట్టాల పేరుతో పత్రాలు పంపిణీ చేసి ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. తాము అధికారం చేపడితే రెండేసి సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు ఇస్తామని నమ్మబలికి అధికారం చేపట్టిన కూటమి ఆచరణలో చర్యలు చేపట్టలేదన్నారు. అనేక ఉద్యమాల నేపథ్యంలో కరువు జిల్లాగా ప్రకటించిన ప్రకాశం జిల్లాకు ఆ మేరకు నిధులు కేటాయించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ చింతల, కొప్పోలులో ఏడేళ్ల క్రితం జిప్లస్ 3 విధానంలో నిర్మాణం చేపట్టిన 4,128 టిడ్కో గహాల్లో సుమారు 1200 పూర్తయ్యాయని, ఈ ఇళ్లకు మౌళిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించాలని, మిగిలిన ఇళ్లు సత్వరం పూర్తిచేసి అందివ్వాలని డిమాండ్ చేశారు. కొప్పోలు మంచినీటి చెరువును అభివద్ధి పరచాలని, ఊర చెరువును సమ్మర్ స్టోరేజ్‌గా మార్చాలని కోరారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి రమేష్ మాట్లాడుతూ డీకే పట్టాలు పొంది ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇంటి పన్ను వేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు కె.రమాదేవి మాట్లాడుతూ నగరంతో పాటు శివారు కాలనీలలో మందుబాబులు వీరంగం చేస్తున్నారని వారి నుంచి మహిళలకు రక్షణ కావాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పార్టీ ప్రతినిధులు జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసుకు వినతి పత్రం అందించారు, మున్సిపల్ కార్మికుల సమస్యలు ఇతర సమస్యలపై కలెక్టర్ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పి కల్పన, నగర కమిటీ సభ్యులు ఎస్డి హుస్సేన్, జి ఆదిలక్ష్మి, సీనియర్ నాయకులు దామా శ్రీనివాసరావు, నగర నాయకులు టి మహేష్, నగరంలోని పలు డివిజన్లకు చెందిన స్థానికులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

## ట్యాంకులతో నీటి సరఫరా చేయాలి

**సిపిఎం జిల్లా నాయకులు ఎం రమేష్ డిమాండ్**

**పొదిలి:** పొదిలి పంచాయతీలో తక్షణం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసి నీటి కొరత తీర్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రమేష్ అధికారులను డిమాండ్ చేశారు. పట్టణంలో నీరు, డ్రైనేజీ, పొదిలి పెద్ద చెరువును తాగునీటి రిజర్వాయర్‌గా మార్చాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పొదిలి నగర పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దచెరువును సాగర్ జలాలతో నింపటమే తమ ప్రథమ కర్తవ్యమన్న కూటమి నేతలు ఆగిన పనులు తొమ్మిది నెలలైనా ప్రారంభించలేదని అన్నారు. ప్రజలకు నీటి కొరత తీరుస్తున్న ఉచిత నీటి ట్యాంకర్లను నిలిపి వేయడంతో డ్రమ్ము నీరు రూ.30 పెట్టి కొనుక్కోవాల్సి వస్తుందని అన్నారు. ఐదుగురు సభ్యులున్న కుటుంబం రోజుకి తాగు, వాడుక నీటి కోసం రూ.వందకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుందని అన్నారు. డ్రైనేజీ, నీటి సమస్య పరిష్కరించకుంటే ప్రజలు రోడ్ల మీదకి రావాల్సి వస్తుందని అన్నారు. అనంతరం కమిషనర్ పి.శ్రీనివాసులకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ డ్రైనేజి, నీటి సమస్య పరిష్కరిస్తామని అన్నారు. ధర్నాలో సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ పి.బాలనరసయ్య, నాయకులు జి.నరసింహారావు, ఆర్. తిరుపతయ్య, ఎ.శ్రీనివాసులు, ఎం.సుబ్బారావు, ఎ బాదుల్లా పాల్గొన్నారు.

శిక్షణలోమాట్లాడుతున్న సిడిఓ సిహెచ్ భారతి

## వికలాంగుల పట్ల శ్రద్ధ పెట్టాలి

**ప్రజాశక్తి-దర్శి**

దివ్యాంగ చిన్నారుల కోసం ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని సిడిపిఓ సిహెచ్ భారతి అన్నారు. మండలంలోని పొతకమూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పోషణ బి పడాయి బి 3వ రోజు శిక్షణ సందర్భంగా మాట్లాడారు. దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు అంగన్‌వాడి కార్యకర్తల శిక్షణలో వివిధ అంశాలపై ఆడియో, వీడియో ద్వారా టీవీపై చూపించి చిన్నారులకు నేర్పవలసిన సృజనాత్మకతను వివరించారు. చిన్నారుల పట్ల ఆటలు, పాటల ద్వారా మాటలు క్రమశిక్షణ సృజనాత్మకత పెంపొందించాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అనురాధ, జ్యోతి, సుభాషిని, సునీత పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిపి ఎం వెంకటేశ్వర్లు

## అభివృద్ధికి కృషి చేయాలి

**ప్రజాశక్తి-సిఎస్.పురం**

గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ఉపాధి హామీ సిబ్బంది తన వంతు కృషి చేయాలని ఎంపిపి మూడుమంచు వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పించి కూలీలు జీవనోపాధి పొందే విధంగా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న నీటి వనరులను సద్వినియోగపరచుకొని గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించే విధంగా పని చేయాలన్నారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతోనే గ్రామాల్లో అన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఎలాంటి వివక్ష లేకుండా అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బ్రహ్మయ్య, ఎపిఓ శ్రీనివాస నాయక్, ఇసి వెంకట్రావు, టిఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

చెక్కులను పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి-దర్శి**

టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తన నివాసం వద్ద తాళ్లూరు మండలంలోని లక్కవరం, తాళ్లూరుకు చెందిన నాన్నం అంజయ్యకు రూ.46,849, ఆరాతోటి చిన్నమ్మాయి రూ.42,324 మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాళ్లూరు మండలం లక్కవరం నాయకులు మేడగం వెంకటేశ్వరరెడ్డి, హనుమారెడ్డి పాల్గొన్నారు.

## మార్చి 31లోపు పన్నులు చెల్లించాలి

**ప్రజాశక్తి-దర్శి**

నగర పంచాయితి పరిధిలో 2024-25 సంవత్సరం ఆస్థి పన్ను, ఖాళీ స్థలం పన్నుల బకాయిలను మార్చి 31లోపు ఏక మొత్తంలో చెల్లించి వడ్డిలో 50శాతం రాయితీ పొందాలని కమిషనర్ వై మహేశ్వరరావు తెలిపారు. ప్రజలందరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల కోరారు. పన్నులు సకాలంలో చెల్లించి నగర పంచాయితి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# సమిష్టి కృషితోనే సమస్యలు పరిష్కారం

**ప్రజాశక్తి-దర్శి**

స్థానిక ఆర్‌అండ్‌బి బంగ్లా ఆవరణలో ప్రజా దర్బార్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ ప్రజలను ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిప్పుకోకుండా తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ప్రజలకు సేవకులుగా జవాబు దారీతనంతో అధికారులు పని చేయాలని కోరారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజలు సమిష్టిగా పని చేస్తేనే సాధ్యమన్నారు. తొమ్మిది నెలల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి లోకేష్‌బాబు ప్రజల సుఖ సంతోషాల కోసం, ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ఎంత కష్టపడుతున్నారో చూస్తున్నామని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అదోగతిపాలై సంక్షోభంలో ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు తీపిస్తున్న పాలకుల స్ఫూర్తిని అందిపుచ్చుకొని పనిచేయాలని కోరారు. ప్రజల వద్దకు పాలన తీసుకువెళ్లే లక్ష్యంతో అధికారులను ప్రజల వద్దకు పంపే కార్యక్రమంలో భాగంగానే ప్రజాదర్బార్ అనే ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ప్రజాదర్బార్ వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. అయితే అధికారులు చిత్తశుద్ధితో ప్రభుత్వ లక్ష్యాలు ప్రజలకు చేరువ చేసేలా పనిచేయాలని కోరారు. భూ సమస్యలు, సర్టిఫికెట్ల జారీ, తాగునిటీ, విద్య, వైద్యానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి తిప్పుకోకుండా, ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పరిష్కరించాలని అధికారులను కోరారు. ప్రజాదర్బార్‌లో అందుకున్న సమస్యలు తక్షణం పరిష్కారమయ్యేందుకు అధికారులు కష్టపడి పని చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల్లో అనేక అద్భుతాలు సృష్టించిందని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా ముందుకు తీసుకెళుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేందుకు అధికారులు చేస్తున్న కృషిని అభినందించారు. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.15 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రధాన రహదారులు రూ.ఐదు కోట్లతో జరుగుతున్నాయని అన్నారు. ఇవి కాక ఐదేళ్లలో వైసీపీ నిర్లక్ష్యానికి నిదర్శనంగా వదిలేసిన అనేక అభివృద్ధి పనులను ముందుకు తీసుకువెళుతున్నామని వివరించారు. టీటీడీ కళ్యాణ మండపం, కోల్డ్ స్టోరేజ్, డిగ్రీ కాలేజీ, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్, అన్నా క్యాంటీన్ ఏర్పాటు, దొనకొండలో సోలార్ పార్క్ త్వరలో ఏర్పాటు, వెనుకబడిన దర్శి ప్రాంతంలో వలసలు నివారించి ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఒక సేవకురాలుగా తాను పని చేస్తానని అన్నారు. ప్రజాదర్బార్‌లో మాజీ శాసన సభ్యులు నారపుశెట్టి పాపారావు, డిఎస్పీ లక్ష్మీనారాయణ, పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తహశీల్దార్ శ్రవణ్‌కుమార్, ఎంపిడిఓ కృష్ణమూర్తి, ఇఓఆర్‌డి ఆవుల సుధాకర్, కమిషనర్ మహేష్, విద్యుత్ అధికారులు ఎడి క్రిష్ణారెడ్డి, టౌన్, రూరల్ ఎఇలు టి చిన్నఅంకబాబు, బి వేణుబాబు, వివిధ శాఖల అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

ప్రజాదర్బార్‌లో దరఖాస్తులు తీసుకుంటున్న గొట్టిపాటి లక్ష్మి

## కరివేపాకు క్షేత్రాల పరిశీలన

కరివేపాకు రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రసాద్ రావు

**ప్రజాశక్తి-తాళ్లూరు**

మండలంలోని బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారి బి ప్రసాదరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కరివేపాకు క్షేత్రాలను పరిశీలించారు. వేసవి ఎండలు తీవ్రం అవుతున్నందున నీటి యాజమాన్యం, అంతర కృషి, సస్యరక్షణ చర్యల వలన అధిక దిగుబడులను పొందవచ్చని అన్నారు. వివిఎలు అజ్మీర్, సుష్మ పాల్గొన్నారు.

**దర్శి :** మండలంలో వెంకటాచలంపల్లి, దర్శి5 రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి వి బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ రైతులు పండించిన కందులను రైతు సేవ కేంద్రంలో అమ్ముకోవలసినదిగా కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సోమ్లా నాయక్, అనూష పాల్గొన్నారు.

**సిఎస్.పురం :** పొలం ఉన్న ప్రతి రైతు గుర్తింపు సంఖ్యను రైతు సేవా కేంద్రం అధికారులు ద్వారా పొందాలని, ప్రస్తుతం అన్ని రకాల డి పట్టా, అసైన్మెంట్ భూములకు రైతు గుర్తింపు సంఖ్య నమోదు చేసుకొనుటకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని ఎఓ సంపత్‌కుమార్ తెలిపారు. కందులు మద్దతు ధర క్వింటకి రూ.7550గా ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. ధాన్యం అమ్ముకోవాలంటే పంట నమోదైన రైతులు రైతు సేవా కేంద్రంలో సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. వ్యక్తిగత వ్యవసాయ పని ముట్లు 50 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు. కొన్ని రకాల పనిముట్లకు సబ్సిడీ పైన సీలింగ్ విధించినట్లు తెలిపారు. వ్యవసాయశాఖ ద్వారా అమలు అవుతున్న వివిధ పథకాలను వివరించారు. పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఓ పి శ్రీనివాసులు, విఎఎ ఎం వెంకట్‌రెడ్డి, వి శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దర్శి ఎఓ బాలకృష్ణనాయక్

రైతు గుర్తింపు నమోదు చేస్తున్న ఏఓ సంపత్ కుమార్

## చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి పెట్టాలి

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో ఇళ్ల నుంచి సేకరిస్తున్న చెత్త నుంచి సంపదను సృష్టించే దానిపై దృష్టి సారించాలని ఈవోఆర్డీ ఈదుల రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని చెత్త సంపద కేంద్రం వద్ద హరిత రాయబారులు, పంచాయితీ కార్యదర్శులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి, వర్మీకం పోస్టు ద్వారా సంపద సృష్టించే దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. పట్టణ, గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య వివరాలు యాప్‌లో నమోదు కావాలని అన్నారు. యాప్‌లో వివరాలు నమోదు చేయకపోయినా, పారిశుధ్య పనులు చేపట్టకపోయినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీలైనన్ని సంపద కేంద్రాలను ఏర్పాటు చేసుకో గలిగితే గ్రామాలు పారిశుధ్యంతో పాటు ఆదాయం లభిస్తుందని తెలిపారు. అనంతరం డిఆర్‌పి జివి సురేష్‌బాబు చెత్త నుంచి సంపదను సృష్టించడంపై శిక్షణ ఇచ్చారు. పంచాయితీ కార్యదర్శులు రామారావు నాయక్, శ్రీనివాసులు మాట్లాడారు.

మాట్లాడుతున్న డిఆర్‌పి సురేష్‌బాబు

## అభివృద్ధికి పాటుపడతా..

**ప్రజాశక్తి-దర్శి**

నియోజకవర్గ అభివృద్ధికి, కార్యకర్తలకు అండగా పనిచేస్తానని తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్ అన్నారు. టిడిపి మండల విస్తృత సమావేశంలో మాట్లాడారు. ఓడిన చోటే గెలిచి చూపించాలన్న యువ నేత ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ని స్ఫూర్తిగా తీసుకొని తెలుగుదేశం జెండా ఎగరవేస్తాని అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, దారం సుబ్బారావు, డిసి అధ్యక్షులు వెలుగొండారెడ్డి, గొర్రె సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు, క్లస్టర్లు రూపీనేని రామారావు, నానబాల అంకయ్య, శోభరణి, నాగమణి, సానే సుబ్బయ్య, వాసు, పుల్లలచెరువు చిన్నా పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

**ప్రజాశక్తి-దర్శి**

మార్చి 29న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె ప్రభుదాసు తెలిపారు. ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. ఈ కంపెనీలో 20 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. జిల్లాకు చెందిన ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు చదివి 19 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, ఉపాధి కల్పన కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ నగేష్, స్కిల్ హబ్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎస్ రమేష్‌ను సంప్రదించాలని అన్నారు. వివరాలకు 9247433273, 9949914337 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్**

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్చార్జి ఎస్ఐ ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఆన్ లైన్ గేమ్‌లు ఆడి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దన్నారు. ప్రస్తుతం దొంగతనాలు అధికంగా జరుగుతున్నందున ఎవరైనా ఇతర గ్రామాలు, పట్టణాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు తెలియజేయాలని కోరారు. గ్రామాల్లో ఎవరైనా అనుమా నాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నేరాలు, దొంగతనాలు నియంత్రణకు డిజీపేట, గణేషునిపల్లి తదితర సెంటర్లలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# అపరాల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ప్రజాశక్తి - పర్చూరు**

మండల పరిధిలోని అడుసుమల్లి గ్రామంలో మార్క్ఫెడ్, నాఫెడ్ వారి ఆధ్వర్యంలో ప్రైమరీ అగ్రికల్చరల్ సొసైటీ ద్వారా అపరాలు కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించినట్లు ఎడిఎ మోహన్‌రావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రైతులు అపరాల పంటలైన శనగ, మినుము మరియు పెసరలను తక్కువ ధరకు అమ్ముకోవద్దని చెప్పారు. ప్రభుత్వం శనగలు క్వింటా రూ.5,650, మినుములు రూ.7,400, పెసలు రూ.8,682 మార్క్ఫెడ్, నాఫెడ్ సహకారంతో సొసైటీల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అడుసుమల్లితో పాటు గొల్లపూడి, అన్నంబొట్ల వారిపాలెం, వీరన్నపాలెం, బోడవాడ, రమణాయపాలెంలో అలపరాల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు అపరాలు కొనుగోలు కేంద్రాలకు తెచ్చేటపుడు తేమ 12శాతం, ఇతర వ్యర్థ పదార్థాలు 2 శాతం, ఇతర తిను గింజలు 1 శాతం , తాలు, పుచ్చు, కేలీలు, పరిపక్వం కాని గింజలు 3 శాతం ఉండేటట్లు చూసుకోవాలన్నారు. రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఎఒ రామ్మోహన రెడ్డి మాట్లాడుతూ పొలం ఉన్న రైతులందరికీ ప్రభుత్వం విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం

అపరాల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మాత్యులు కింజారపు అచ్చం నాయుడు జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఒ రమాదేవి, పిడిసిసి బ్యాంకు మేనేజర్ విశ్వేశ్వర రావు, పిడిసిపి సూపర్ వైజర్ శ్రీనివాస రావు , టిడిపి రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కకృష్ణ, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి అడ్డగడ్డ వేణు , వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ఎంపిటిసి కాపు రవి చంద్ర , గ్రామ పెద్దలు కారుమంచి పాపారావు, కొరగంటి వెంకటేశ్వర్లు, యర్రం రాంబాబు, పోపూరి శ్రీను, ఆదినారాయణ , విఎఎలు ఆదిలక్ష్మి, అరుణ, శ్రీకాంత్, ఫిలిప్, సౌమ్య, ఝాన్సీ, నాగబాబు, రైతులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలో రైతులకు అన్ని కష్టాలే

## మాజీ మంత్రి, వైసిపి బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున

**ప్రజాశక్తి - బాపట్ల**

చంద్రబాబు పాలనలో రైతులకు అన్ని కష్టాలే నని రాష్ట్ర మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతితో కలిసి నాగార్జున మాట్లాడారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతుల అల్లాడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలును నిలిపేసి రైతులను అనేక రకాలు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల రాష్ట్రంలో రైతులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైలు పేటలో వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ వైద్య కళాశాల నిర్మాణంపై మాట్లాడకపోవడంతో కూటమి ప్రభుత్వం పట్ల ఆ ప్రాంత ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. మెడికల్

మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున

కళాశాల నిర్మాణం కోసం చేర్చిన మెటీరియల్ తరలించకపోతున్నా పట్టించుకునే నాధుడు లేడన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పూనుకొని మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గవిని కష్ణమూర్తి, జోగి రాజా, కొక్కిలిగడ్డ చెంచయ్య ,కటికల యెహోషువ, శ్రీనివాసరెడ్డి, అంకమ్మరావు, పిన్ని బోయిన ప్రసాద్, బొలిమేర అనీల్ కుమార్, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నమాచార్యులుకు నివాళి

**ప్రజాశక్తి-అద్దంకి**

పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు 522వ ఆరాధన మహోత్సవం శ్రీ దాస భారతీయ జానపద కళాక్షేత్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా అన్నమాచార్యులు విగ్రహానికి శ్రీ దాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, విశ్రాంత ఆర్‌జెడి యు.దేవ పాలన, టిటిడి ధర్మాచార్యులు పెద్దిశెట్టి వెంకటాద్రి తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చెన్నుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ తాళ్లపాక అన్న మాచార్యులు ఏడుకొండల వెంకటేశ్వర స్వామిపై 32 వేల కీర్తనలు రచించారని తెలిపారు. అన్నమాచార్యులు ఆధాత్మికమే కాకుండా శ్రామికులు పాడుకునే చక్కని పాటలు, కీర్తనలు రచించారని తెలిపారు. విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, దేవ పాలన మాట్లాడుతూ గొప్ప వాగ్గేయకారుడు అన్నమాచార్యులు విగ్రహం అద్దంకిలో ఏర్పాటు చేయడం గొప్ప విషయన్నారు. ఈ కార్యక్రమంలో మాదాల దానయ్య, పుట్టా వీరాంజనేయులు, పెద్దిశెట్టి వెంకటాద్రి, రామిశెట్టి రవి, యర్రమోతు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న కళాక్షేత్రం నాయకులు

# తెల్లబర్లీ పొగాకు కొనుగోలు నిలిపివేత

**ప్రజాశక్తి - పంగులూరు**

నల్లబర్లీ పొగాకు అమ్ముడు పోక రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇదే తరుణంలో మంగళవారం నుంచి తెల్లబర్లి పొగాకు కొనుగోలు కూడా నిలిపివేశారు. దీంతో నల్లబర్లీ, తెల్లబర్లీ పొగాకు రైతులలో ఆందోళన మొదలైంది. కోరిశపాడు కేంద్రంగా జిపిఐ కంపెనీ గత నెల రోజుల నుంచి పొగాకు కొనుగోలు చేస్తుంది. పంగులూరు , కోరిశపాడు,అద్దంకి, ఇంకొల్లు, మార్టూరు తదితర ప్రాంతాల రైతులతో పాటు వినుకొండ ప్రాంత రైతులు కూడా తెల్లబర్లీ పొగాకును ఇక్కడికి తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. ఈ కంపెనీ మరో కొద్ది రోజుల్లో నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేస్తామని చెబుతూ వస్తుంది. గత సంవత్సరం తెల్లబర్లీ,నల్లబర్లి పొగాకు ఒకేసారి కొనుగోలు చేసిన కంపెనీ, ఈసారి నల్లబర్లీ పొగాకు కొనుగోలును ఆలస్యం చేసింది. నల్లబర్లీ పొగాకును అదుగో కొంటాం ఇదిగో కొంటాం అంటూ ఆలస్యం చేస్తూ వస్తున్నారు. దీంతో నల్లబర్లీ రైతులు ఆందోళన చెందుతున్నారు. పొగాకును కొంటారో కొనరో కూడా తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారు. ఈ క్రమంలో తెల్లబర్లీ పొగాకు కొనుగోలు కూడా మంగళవారం నుంచి నిలిపివేయడంతో నల్లబర్లీ రైతులతో పాటు తెల్లబర్లీ రైతులలో కూడా ఆందోళన మొదలైంది. ఉన్నట్టుండి ఒకసారిగా కొనుగోలను నిలిపివేయటం ఏమిటో అర్థం కాక రైతులు సతమతమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే స్పందించి పొగాకును తక్షణమే కొనుగోలు చేసే విధంగా ఆయా కంపెనీలతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తెల్లబర్లీ పొగాకు ప్రాసెసింగ్ జరుపుతున్న దశ్యం (ఫైల్)

# దరఖాస్తులకు ఆహ్వానం

**ప్రజాశక్తి- చెరుకుపల్లి**

కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ లాజర్ ఓ ప్రకటనలో తెలిపారు. 2025- విద్యా సంవత్సరానికి 6 మరియు 11వ తరగతులలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 7,8,9,10,12 వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాధలు, బడి బయట బాలలు, డ్రాప్ అవుట్స్, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ కేటగిరీలకు చెందిన బిపిఎల్ కుటుంబాల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 7075159996, 7075039990 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చునని ఎంఇఒ తెలిపారు.

# సహాయనిధి చెక్కులు అందజేత

**ప్రజాశక్తి - రేపల్లె**

పేదల ఆరోగ్య అవసరాలకు సిఎం సహాయనిధి వరమని రెవెన్యూ శాఖ మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన నగదును బుధవారం శివప్రసాద్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. నిజాంపట్నం మండలం పలపట్ల గ్రామానికి చెందిన కరీముల్లా బేగ్‌కు రూ.1,02,143, దిండి గ్రామానికి చెందిన మోర్ల లావణ్యకు రూ .87,227, రేపల్లె మండలం రాజుకాల్వ గ్రామానికి చెందిన కొక్కిలగడ్డ హర్షిత కు రూ.80,600, రేపల్లె పట్టణం 15వ వార్డుకు చెందిన గడ్డిపాటి శ్రీనివాసులుకు రూ. 68,147, 10వ వార్డుకు చెందిన బొల్లిశెట్టి నాగవెంకట రుక్మిణికుమార్‌కు రూ.60,552 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేర్లు నమోదు చేయించుకోవాలి

**ప్రజాశక్తి - కారంచేడు**

ఇప్పటికీ విశిష్ట గుర్తింపు కార్డు కోసం పేర్లు నమోదు చేసుకోని రైతులు వెంటనే నమోదు చేయించుకోవాలని ఎఒ కె. సుధీర్ బాబు తెలిపారు. మండల పరిధిలోని నాయుడువారి పాలెం, జరుబులవారిపాలెం గ్రామాల్లో బుధవారం నాడు పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలంలో సుమారు 1500 మంది రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. వారి వెంటనే తమ దగ్గరలోని రైతు సేవా కేంద్రాలను సిబ్బందిని సంప్రదించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. విశిష్ట గుర్తింపు నంబరు ఉంటేనే ప్రభుత్వ పథకాలటు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిందు మాధురి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# దంత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-అద్దంకి**

దంత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులు తెలిపారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సంద ర్భంగా దంత వ్యాధులపై ప్రజలకు బుధవారం అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ నోటి ఆరోగ్యమే దేహ ఆరోగ్యమని తెలిపారు. నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పొగాకు, పాన్, జర్దా, ఖైనీ లాంటి పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్నపిల్లలు సైతం 70 శాతం మంది ఏదో ఒక రకమైన దంత సమస్యతో బాధపడున్నట్లు తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేయించుకోవాలన్నారు. దంత వైద్య నిపుణులు డాక్టర్ జి.మెర్సీ మాట్లాడుతూ దంత సమస్యలకు దూరంగా ఉండేందుకు ఉదయం,సాయంత్రం పూట నోటిని రెండుసార్లు శుభ్రం చేసుకోవాలన్నారు. డాక్టర్ వాకిలా చౌదరి, అనిత, జ్యోతి, ప్రతీప్ కుమార్ సామాజిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రొయ్య రైతుల

# విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తా..

## ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

జిల్లాలో రొయ్య రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎపిసిపిడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కట్టా వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. రొయ్య రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శింగరాయకొండ, టంగుటూరు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు ఒంగోలు రూరల్ మండలాలకు చెందిన రొయ్య రైతులు ఎస్ఇ ఛాంబర్‌లో సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను కలసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా రొయ్య రైతులు మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వెంటనే అమర్చటం లేదని, విద్యుత్ స్తంభాలు దెబ్బతిని సరఫరాలో జాప్యాన్ని నివారించాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫారాల వద్ద ఏబి స్విచ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కొత్తగా రొయ్యల సాగులో డిజిటల్ స్మార్ట్ మీటర్లు, ఆటోమాటిక్ కెపాసిటర్స్ బిగించటంతో రైతులకు ఆర్థికంగా భారంగా మారుతుందని తెలియజేశారు. ఆయా సమస్యలపై ఎస్ఇ

మాట్లాడుతున్న ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు

డిఇలు, ఏఇలతో చర్చించారు. అనంతరం ఎస్ఇ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల వారీగా గుర్తించి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రొయ్యల సాగుకు నిరంతరాయంగా విద్యుత్ అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఒంగోలు డిఇ మాకినేని హరిబాబు, కందుకూరు డిఇ నాగేశ్వర రావు, రొయ్యల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దుగ్గినేని గోపీనాధ్, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారెడ్డి, గౌరవాధ్యక్షులు పమిడి సుబ్బానాయుడు, ఉపాధ్యక్షులు శింగనేని అంజిబాబు, రొయ్య రైతులు పాల్గొన్నారు.

## కలెక్టర్ల సమావేశానికి వెంకటమురళి హాజరు

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన విజయవాడలో రెండవ రోజు నిర్వహిస్తున్న కలెక్టర్ల సమీక్ష సమావేశానికి బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి హాజరయ్యారు.

## వైసీపీ రాష్ట్ర ప్రచార విభాగ అధ్యక్షుడిగా రాజశేఖర్

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగ అధ్యక్షునిగా జిల్లాకు చెందిన కాకుమాను రాజశేఖర్‌ను నియమిస్తూ ఆ పార్టీ ఆదేశాలు ఇచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడినప్పటి నుంచి ఆ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయనకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఈ బాధ్యతలు అప్పగించారు.

రాజశేఖర్

ఎన్నికలలో గెలిచినా, ఓడినా..

# ప్రజాఉద్యమాల్లో భాగస్వామినవుతా..

## మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

**ప్రజాశక్తి-బాపట్ల**

ఎన్నికల్లో గెలిచినా, ఓడినా ప్రజా ఉద్యమాల్లో భాగస్వామినవుతానని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బుధవారం ఇటీవల జరిగిన శాసనమండలి ఎన్నికల్లో కె ఎస్ లక్ష్మణరావు గెలుపునకు కృషిచేసిన కార్యకర్తలతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.వినయ్ కుమార్ అధ్యక్షత వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలకు పాల్పడి గెలవడం జరిగిందన్నారు. తాను గెలిచినా, ఓడినా ప్రజల, కార్మికుల పక్షాన నిరంతరం నిలబడి ప్రజా ఉద్యమాల బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగ, కార్మికులకు అనేక వాగ్దానాలు ఇవ్వటం జరిగిందన్నారు. ఆ వాగ్దానాల అమలు చేయడం కోసం ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు. శాసనమండలి ఎన్నికల్లో గెలిస్తే మండలిలో ప్రజావాణి వినిపించేవాడిని. ఇప్పుడు విజయవాడలో అలంకార్ థియేటర్ వద్ద ధర్నా చౌక్ లో మన వాణిని వినిపిస్తోందన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామ్య విలువలను నెలకొల్పటం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు కాపాడటం కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని కోరారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఉద్యమాలు పట్ల నిర్బంధాలు పెడితే వాళ్లకి తగిన గుణపాఠం చెప్తారన్నారు. కార్మికులు, కర్షకులు, మహిళలు, దళితులు, గిరిజనులు, పక్షాన నిలబడి ప్రజా ఉద్యమాలు బలోపేతం చేయడానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కె .రామారావు , యుటిఎఫ్ జిల్లా, మండల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రీసర్వేపై బాధ్యతగా పనిచేయండి

- హద్దుల గుర్తింపులో జాగ్రత్తలు పాటించాలి
- గ్రామ సభలు నిర్వహించాలి
- జేసీ ఆర్.గోపాలకృష్ణ

మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

క్షేత్రస్థాయిలో రీసర్వే ప్రక్రియ పటిష్టంగా అమలు జరిగేలా రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లు బాధ్యతగా పనిచేయాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టులో రీ సర్వే, పిజిఆర్ఎస్, పలు రెవెన్యూ అంశాలపై జిల్లాలోని ఆర్డీవోలు, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్లు, తహశీల్దార్లు, ఆర్ఎస్‌డిటిలు, మండల సర్వేయర్లు, డిప్యూటీ తహశీల్దార్లతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రీసర్వే ప్రక్రియ పటిష్టంగా అమలు జరిగేలా తహశీల్దార్లు, మండల సర్వేయర్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. రీ సర్వే కార్యక్రమం పటిష్టంగా జరిగితే భూసమస్యలు తగ్గుతాయని తెలిపారు. మండల సర్వేయర్లు, గ్రామ సర్వే హద్దుల గుర్తింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూ యజమానికి ముందుగా రీ సర్వేపై తెలియజేయాలని సూచించారు. సర్వేలో తప్పులు లేకుండా అలాంటి పరిస్థితి రాకుండా ప్రస్తుత సర్వేలో ఉండొద్దని అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను ఇచ్చిందని, ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్వహించే రీ సర్వే ప్రాజెక్టులో 38 మండలాలలో 38 గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసుకుని సర్వేను ప్రారంభించామన్నారు. ఆర్డీవోల ఆధ్వర్యంలో రీసర్వేపై ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని సంయుక్త కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామ సరిహద్దులను గుర్తించి గ్రామంలోని అన్ని ప్రభుత్వ భూములను గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వేకు సంబంధించి ఇచ్చిన ఎస్ఓపిని తూచా తప్పకుండా పాటించాలని జెసి ఆదేశించారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన వినతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఆ సమస్యను పరిశీలించి, అర్జీదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పిటిషన్ తిరస్కరిస్తున్నట్లు కారణాలు తెలపాలన్నారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ అధికారి మహ్మద్ గౌస్ బాషా, జిల్లాలోని తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## 15 శాతం వృద్ధిరేటు సాధనకు కృషి: కలెక్టర్

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

స్వర్ణాంధ్ర 2047లో భాగంగా ప్రకాశం జిల్లాలో 15 శాతం వృద్ధి రేటు సాధించే దిశగా కృషి చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా వివరించారు. అమరావతి సచివాలయంలో సిఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 2వ రోజు కలెక్టర్ల సమావేశంలో ప్రకాశం కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా మాట్లాడుతూ 15 శాతం వృద్ధి రేటు సాధించే విధంగా జిల్లా ప్రగతి ప్రణాళికలను వివరించారు.

కలెక్టర్ తమీమ్ అన్సారియా

పన్నులు చెల్లించలేదని

# నీటి కుళాయిలు కట్

- మున్సిపల్ అధికారుల చర్యలు
- అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారికి ఇక్కట్లు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

ఇంటి పన్ను బకాయిలు చెల్లించని వారిపై కార్పొరేషన్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఇంటి పన్నులు, తాగునీటి కొళాయి పన్నుల బకాయిలున్న వారిపై కార్పొరేషన్ సిబ్బంది ప్రత్యక్ష చర్యలకు పూనుకున్నారు. పన్నులు చెల్లించని వారికి చెందిన మంచినీటి కొళాయిల కనెక్షన్లు తొలగించే ప్రక్రియకు కార్పొరేషన్ సిబ్బంది శ్రీకారం చుట్టారు. పన్నులు బకాయిలున్న షాపులను కూడా బలవంతంగా మూసివేస్తున్నట్లు సమాచారం. సిబ్బందిని గడువు కోరినప్పటికీ కుళాయిలు తొలిగించే ప్రక్రియను ఆపకుండా కొనసాగిస్తున్నారు. మంగళవారం నుంచి నగర పరిధిలో ఉన్న రాజీవ్ గహకల్ప వార్డు సచివాలయ పరిధిలో కార్పొరేషన్ సిబ్బంది కొళాయిలు తొలగించే ప్రక్రియను చేపట్టారు. ఎవరయితే ఇంటి పన్ను, కుళాయి పన్ను బకాయి వున్నారో, వారికి చెందిన మంచి నీటి కుళాయి తొలగించాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చినట్లు సిబ్బంది

కుళాయిలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పేర్కొంటున్నారు.

అద్దెకు నివసిస్తున్న వారు యజమానులకు తెలియజేసి.. వారి ద్వారా పలు చెల్లించడం, పన్ను చెల్లించి ఉన్నచో దానికి సంబంధించిన రశీదులు అద్దెకు ఉండేవారి వద్ద ఉంచుకోవాలని, కార్పొరేషన్ సిబ్బంది ఉచిత సలహా ఇస్తున్నారు. యజమానులు చెల్లించని పక్షాన అద్దెకు నివాసం ఉంటున్న వారు ఖచ్చితంగా పనులు చెల్లించాలని సిబ్బంది స్పష్టం చేస్తున్నారు. పన్నులు చెల్లించిన ఎడల తాగునీటి కొళాయిలు తొలగిస్తామని హెచ్చరిస్తున్నారు.

ఇంటి పన్నులు పెండింగ్ బకాయిల అంశంపై వారం పది రోజులుగా నగరంలోని అన్ని డివిజన్లో బకాయిదారులకు నోటీసులు అందించారు. మార్చి లోపు వడ్డీతో సహా పన్నులు చెల్లించాలని అధికారులు నోటీసులు అందించారు. మార్చి 31 లోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ 50 శాతం రాయితీ ఇస్తామని కూడా మైక్ ప్రచారం చేపట్టారు. అయితే యజమానులు అందుబాటులో లేని, అత్యధిక బకాయిలు ఉన్న వారు పన్నులు చెల్లించకపోవడంతో మంచినీటి కుళాయిలు కనెక్షన్లు తొలగింపు చర్యలకు కార్పొరేషన్ సిబ్బంది చేపట్టింది. ఈ చర్యలపై ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

### గడువు పెంచాలి

పన్నులు చెల్లించలేదని ఇంటి కుళాయిలు తొలగించటం, షాపులు మూసివేయడం వంటి చర్యలు అధికారులకు తగదని రాజీవ్ గృహకల్ప నివాసి పెంట్యాల కల్పన హితవు పలికారు. ఇంటి పన్నుపై విధించిన వడ్డీని పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆస్తి ఆధారంగా ఇంటి పన్నులు లెక్కించే ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాత విధానంలోనే ఇంటి ఆధారంగా పన్నులను లెక్కించాలని సూచించారు.